క్లుప్తంగా

సెల్‌ఫోను అప్పగింత



ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మిస్సయిన సెల్‌ఫోన్‌ను గుర్తించి మంగళవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. పట్టణానికి చెందిన వంశీధర్‌శెట్టి నెలరోజుల క్రితం బైక్‌పై ప్రయాణిస్తుండగా దారి మధ్యలో సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ గద్వాలలో గుర్తించి రికవరీ చేశారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయిన లేదా పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

విద్యార్థులకు అభినందన



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని కేపీఎస్ స్కూల్‌లో పదో తరగతి చదివిన విద్యార్థులు ట్రిబుల్ ఐటీ, జేఈఈ, అడ్వాన్స్, మెయిన్స్, నీట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. మంగళవారం రామకృష్ణ పరమహంస ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ కృష్ణయ్య హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివి ఉన్నత శిఖరాలకు దారులు వేసుకున్న విద్యార్థులకు రానున్న రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, డైరెక్టర్ చంద్రహాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నాగుపాము కలకలం



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని మర్రికుంటలో ఓ ఇంటి సమీపంలో నాగుపాము సంచరించడంతో స్థానికులు గమనించి సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ (హోంగార్డు)కు ఫోనులో సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ఇంటి పరిసరాల్లో ఉన్న నాగుపామును పట్టుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణసాగర్ మాట్లాడుతూ వారం రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున విషసర్పాలు ఇళ్లలోకి చొరబడే అవకాశం ఉందని తెలిపారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి గేట్లకు ప్లాస్టిక్ సీట్లతో రంధ్రాలు లేకుండా కప్పి ఉంచాలని సూచించారు. వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికైనా పాము కరిస్తే నాటు వైద్యం కాకుండా ఆస్పత్రికి వెళ్లి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

పెద్ద పీర్ల మసీదులో ప్రార్థనలు



అమరచింత: పట్టణంలోని పెద్దపీర్ల మసీదులో ప్రతిష్ఠించిన ఇమామే ఉస్సేన్ పీర్లను మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు జలేందర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచమంతా సుఖఃసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. మొహర్రం కులమతాలకు అతీతంగా కలిసి జరుపుకొనే పండుగ అన్నారు. మసీదు అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్ గౌడ్, క్యామ భాస్కర్, అశోక్, దుబాయి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కొత్తకోట రూరల్: వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని అప్పరాలకు చెందిన మారుతికి సంబంధించిన పెంకుటిల్లు కూలిపోయింది. సర్పంచ్ హిమబిందు ద్వారా సమాచారం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ రెడ్యానాయక్ కూలిపోయిన ఇల్లును పరిశీలించారు. ఇంట్లో ఉన్న వంట సామగ్రితో పాటు బట్టలు, నిత్యావసర సరుకులు పూర్తిగా ధ్వంసమైనట్లు బాధితుడు వాపోయాడు. ఇల్లు కూలిపోయిన విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తామని డిప్యూటీ తహసీల్దార్ రెడ్యానాయక్ తెలిపారు.

భయాందోళనతో బోధన సాగేనా..

- శిథిలావస్థలో చింతకుంట ఉన్నత పాఠశాల భవనం
- చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ
- ముసురు వర్షాలతో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు



వర్షపు నీటిలో నడుస్తున్న విద్యార్థులు



చింతకుంట ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

పాన్‌గల్: మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 126 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో మొత్తం 5 గదులకు 3 గదులు శిథిలావస్థలో ఉండటంతో 2 గదులు మాత్రమే వినియోగంలో ఉండటంతో తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. శిథిలావస్థ భవనంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు పాఠశాల ఆవరణ వర్షపు నీటితో నిండి చెరువును తలపిస్తుంది. పాఠశాల ఆవరణ వర్షపు నీటితో నిండిపోవడంతో తరగతి గదులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్లేందుకు నాన అవస్థలు పడుతున్నారు. నిల్వ నీటిలో అక్కడక్కడ రాళ్లు వేసి వాటిపై నడుచుకుంటూ తరగతి గదుల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి దాపరించింది. పాఠశాల గదులు శిథిలావస్థకు చేరుకోవడం, సరిపడా గదులు లేక వరండాలో రెండు, మూడు తరగతుల విద్యార్థులను కూర్చబొట్టి బోధన చేయాల్సి వస్తుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

నూతన భవనం వినియోగంలోకి వచ్చేనా..

ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరడంతో అదనపు తరగతి గదులను గ్రామానికి దూరంగా నిర్మించడం, భవనంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఇంకా నిర్మాణం దశలోనే ఉండటంతో నూతన భవనాన్ని ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో పాత భవనంలో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందుల నడుమ బోధన కొనసాగిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం లేక నూతన భవనం నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతుండటంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే నూతన భవనంలోకి మారాలని కోరుతున్నారు.

రైతుబీమాకు దరఖాస్తుల ఆహ్వానం



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారి

ఖిల్లాఘనపురం: వ్యవసాయ భూముల పట్టా పాసు బుక్కులు కలిగిన ప్రతి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో పట్టా పాసుబుక్కులు ఉలిగి ఉన్న రైతులు 15,138 మంది ఉండగా.. వారిలో 10,891 మంది రైతుబీమాకు అర్హులని తెలిపారు. కానీ ఇప్పటి వరకు కేవలం 8,413 మంది రైతులు మాత్రమే బీమా చేసుకున్నారని వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 18వ తేదీ వరకు పట్టా పాసుబుక్కు పొంది అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆగస్టు 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు గ్రామాల పరిధిలోని రైతువేదికల వద్ద ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పెద్దమందడిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

కొత్తకోట రూరల్: వీఆర్‌ఏలకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయడంతో పాటు పేస్కేల్‌ను అమలు చేసిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సముచిత స్థానాన్ని కల్పిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో సేవలు అందించిన వీఆర్‌ఏల కష్టాలను సీఎం కేసీఆర్ గుర్తించారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం కేసీఆర్‌కు, మంత్రి నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అశోక్, నాగేంద్రం, శశికళ, భాగ్యమ్మ, రాములు, శ్రీను, కొండయ్య, ఆంజనేయులు సునిత ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం బీఆర్‌ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు విప్పటూరి విక్రం మాట్లాడుతూ ముఖ్యమంత్రి అన్ని వర్గాలను ఆదుకుంటున్నారని కొనియాడారు. ఎన్నో ఏళ్లుగా పేస్కేల్ ప్రకటించాలని, అర్హతలను బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని, వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని వీఆర్‌ఏలు కోరగా.. సీఎం వారికి న్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు రామ్మోహన్, నగేష్, అంజమ్మ, యాదయ్య, వెంకటయ్యగౌడ్, స్వప్న, పద్మ, లింగేశ్వరి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్య స్థాపనకు కృషి



ఆత్మకూర్‌లో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: కేంద్రం, రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనను మరోమారు తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా శ్రమించాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రం ప్రభుత్వాలు అరాచక పాలన కొనసాగిస్తున్నాయని మండిపడ్డారు. నిరుపేదలకు ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు అందటం లేదన్నారు. రేషన్ కార్డుల కోసం దరకాస్తు చేసుకున్న పేదలు ఇప్పటి వరకు వాటి కోసం ఎదురు చూస్తున్న పరిస్థితులు దాపరించడం శోచనీయం అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రేషన్ కార్డు కోసం దరకాస్తు చేసుకోవడమే ఆలస్యం, వెంటనే లబ్ధిదారులకు కార్డులు అందేవని గుర్తు చేశారు. కార్యక్రమంలో జుబేర్‌అహ్మద్, మాజీ ఎంపీటీసీ మహంకాళీ విష్ణు, వెంకటేశ్వర్‌రెడ్డి, మన్నన్, మొగిలి గంగాధర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మాజీ ఎమ్మెల్యే, ఆప్కాబ్, డీసీసీబీ మాజీ చైర్మన్ వీరారెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలో కాంగ్రెస్ నాయకులు పుల్లరి మంజుల, గణేష్ ఆధ్వర్యంలో నిరుపేదలకు చీరలు, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణి చేశారు. అనంతరం స్థానిక ఇందిరాగాంధీ విగ్రహం వద్ద వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, పరమేష్, నల్గొండ్ల శ్రీను, గణేష్ ముదిరాజ్, హరీశ్‌గౌడ్, వినయ్‌రెడ్డి, జబ్బార్, ఈర్లదిన్నె శ్రీను, ఖాజన్న, రవీందర్, విజయలక్ష్మి, షబ్బీర్, గాండ్లరఘు, వెంకటన్న, నర్సింహ, బుచ్చన్న, మధు పాల్గొన్నారు.

ముస్లింలను మోసం చేసేందుకే మైనార్టీ బంధు

పెబ్బేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వానికి ముస్లింలపై ప్రేమ ఉంటే గతంలో వారికి ఇచ్చిన హామీలు తొమ్మిదేళ్ల పాలనలో ఎందుకు నెరవేర్చలేదని శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాముడు యాదవ్ ప్రశ్నించారు. ఆయన మంగళవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి మోసం చేసిన బీఆర్‌ఎస్ అధిష్టానం నేడు మైనార్టీ బంధుతో మరోసారి మోసం చేయడానికి సిద్ధపడిందని దుయ్యబట్టారు. మైనార్టీబంధు కింద ముస్లింలకు రూ.లక్ష సాయం చేస్తామని మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఇప్పటికే ఇస్తామన్న దళితబంధు, గిరిజనబంధు, బీసీలకు సాయం ఎంత మందికి మంజూరు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్, ఎంపీటీసీ ఎల్లస్వామి, అశోక్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

గోపాల్‌పేట: రేవల్లి మండలానికి చెందిన యువతి అదృశ్యమైన ఘటనలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గౌరిదేవిపల్లికి చెందిన కుర్మయ్య కుమార్తె నాగర్‌కర్నూల్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఎప్పటిలాగే సోమవారం కాలేజీకి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్ల వద్ద, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి కుర్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో మంగళవారం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, లేబర్ డిపార్ట్‌మెంట్ వనపర్తి జిల్లా వారి సహకారంతో భవన నిర్మాణ కార్మికులకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కార్డు కలిగి ఉన్న వారందరికీ 15 రోజుల పాటు మేస్త్రీ పనిలో మెళకువలు, నూతన నిర్మాణ పద్ధతుల గురించి నేర్పిస్తామని తెలిపారు. శిక్షణ తర్వాత సర్టిఫికెట్‌తో పాటు ఉపకార వేతనం కింద రూ.4,500 అందజేస్తామని, ఈ శిక్షణ కార్యక్రమం అర్హులందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మేస్త్రీ సంఘం అధ్యక్షుడు వెంకటేష్‌సాగర్, వెంకటయ్య, జనార్దన్, కురుమూర్తి, శివశంకర్, నిజలింగప్ప, గంగాధర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలని ధర్నా



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వరి నాటుతున్న నాయకులు

పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లిలో నిలిపివేసిన రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేసి వరి నాటు వేస్తూ నిరసన చేశారు. పెబ్బేరు నుంచి కంచిరావుపల్లి, వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు నిత్యం వందల వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదగా మారి గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో వాటిని అంచనా వేయలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రి నిరంజన్‌రెడ్డి ఈ రోడ్డు పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దీని కోసం కేటాయించిన నిధులు ఎక్కడ పోయాయని, ఈ పనులు ఎందుకు ముందుకు సాగడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, బాలచందర్, సోమగౌడ్, సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, వెంకటేష్, శివకుమార్, రాజేష్, సాయిప్రసాద్, బాలకృష్ణ, అంజనేయులు, లక్ష్మి, చిట్టెమ్మ, నాగేంద్రమ్మ, దేవమ్మ, గోవిందమ్మ, శేఖర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు ఏర్పాటు చేయాలని నిరసన



ధర్నా చేస్తున్న మహిళలు

పాన్‌గల్: కేతేపల్లిలోని భగత్‌సింగ్‌నగర్‌లో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామంలోని మూడు రేషన్ షాపులు ఒకే వైపు ఉన్నాయని, ఎక్కువ భాగం భగత్‌సింగ్ నగర్ కాలనీలో నివసిస్తున్న ప్రజలు రేషన్ సరుకులు తీసుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాత గ్రామంలో ఉన్న మూడు రేషన్ దుకాణాల్లో ఒక షాపును భగత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేయాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తహసీల్దార్‌కు సూచించినా.. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగత్‌సింగ్‌నగర్‌లో రేషన్‌షాపు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుర్మయ్య, బాలస్వామి, పెంటయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సంతోష్, మహిళలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ చాంద్‌పాషా

అమరచింత: కొత్త ఓటర్ నమోదుతో పాటు మార్పులు చేర్పులపై బీఎల్‌ఓలు దృష్టి సారించాలని తహసీల్దార్ చాంద్‌పాషా అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల స్థాయి బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఫామ్ 7, 8 లో ఓటరు మార్పులతో పాటు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ఓటరు కోరుకున్న వార్డులో ఓటు హక్కు ఉండేలా చొరవ చూపాలన్నారు. 18ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు పొందేలా బీఎల్‌ఓలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఆర్‌ఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి



వనపర్తిలో నిరసన తెలుపుతున్న నాయకులు



అమరచింతలో..

కొత్తకోట: మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పి హింసాకాండకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడుతూ మణిపూర్‌లో దుర్మార్గానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కుకీ గిరిజన మహిళలపై సామూహిక లైంగిక దాడి జరిపి వారిని నగ్నంగా ఊరేగించి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో శివ, కొండన్న, శ్యాంసుందర్, రాజు, డేవిడ్, కుర్మన్న, శిరీష, సుశీల, సుగుణమ్మ, పద్మమ్మ, మన్నెమ్మ, సరళ తదితరులు ఉన్నారు.

అమరచింత: మణిపూర్‌లో జరిగిన జాతి విద్వేష ఘటనలు యావత్ దేశం తలదించుకునేలా ఉందని, అలాంటి అమానుష ఘటనలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ఆందోళన వ్యక్తం చేశారు. అల్లర్లను నివారించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని ప్రధాన రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్, రాజన్న, జీఎస్. గోపి, రాజు, శ్యాంసుందర్, బుచ్చన్న, సామేలు, అబ్రహం, భాస్కర్, కుతుబ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మద్దతు

పట్టణంలో మణిపూర్‌లో జరిగిన దారుణ ఘటనపై వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాస్తారోకోకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి మద్దతు తెలిపారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ పాలనలో మత ఘర్షణలు పెరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో జుబేర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ మహంకాళీ విష్ణు, మన్నన్, పాస్టర్ హ్యాపీపాల్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసిలు, దళితులపై అత్యాచారాలు, దాడులు, హత్యలు, మారణహోమం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింహశెట్టి, రాబర్ట్, మోష, దామోదర్, శివరాములు, భారతీయుడు, అంజి, ఖాజ ఉన్నారు.

పాన్‌గల్: మణిపూర్ రాష్ట్రంలో మహిళల నగ్న ఊరేగింపు, పలువురిపై అత్యాచార ఘటనకు కారణమైన వారిని శిక్షించడంలో విఫలమైన మణిపూర్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ గిరిజన సంఘం, ఐద్వా మహిళా సంఘాలు, సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, సీపీఐ ఆధ్వర్యంలో కేతేపల్లిలో నిరసన వ్యక్తం చేశారు.

పెబ్బేరు రూరల్: మణిపూర్ గిరిజన మహిళలపై జరుగుతున్న హింసాకాండను ఆపాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రజుమంఓల సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలకృష్ణ, బాలస్వామి, వెంకటేష్, లక్ష్మయ్య, సాయిలు, రాముడు, నాగశేషి, రామ్‌చందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు తాత్కాలిక మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దారులన్నీ గుంతలమయంగా మారడంతో సాక్షి దినపత్రిక సోమవారం 'యమపురికి దారులు' అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన పుర పాలక మండలి చైర్‌పర్సన్ గాయత్రి పట్టణంలోని గాంధీచౌక్ నుంచి అమరచింత వైపు, బస్టాండ్ రోడ్డు, కొత్తకోట వైపు రోడ్డు, పాత మున్సిపాలిటీవైపు రోడ్డు తాత్కాలికంగా కంకర, డస్టు, మొరంతో గుంతలను పూడ్చారు. త్వరలోనే శాశ్వతంగా రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆమె తెలిపారు.

బీజేపీతోనే సంక్షేమం

పాన్‌గల్: మండలంలో బీజేపీ నిర్వహిస్తున్న గడప, గడపకు బీజేపీ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ అన్వేష్ అన్నారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలతో ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, శివరాం, శ్రీకాంత్, లక్ష్మణ్, మధుసూదన్‌యాదవ్, వెంకట్‌సాగర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

పాన్‌గల్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు మంగళవారం సీఐటీయూ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, సీఐటీయూ మండల కన్వీనర్ రాము, సుబ్బయ్య, సుగ్రీవుడు, బాలస్వామి, రంగస్వామి, కుర్మయ్య, వెంకటయ్య, రాజు, చిట్టెమ్మ, నాగమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

కళ్లకు నల్లబ్యాడ్జీలతో నిరసన

మదనాపురం: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కళ్లకు నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, రాజు, అంజి, పరశురాం, నాగన్న, శ్రీనివాసులు, తిరుపతయ్య, మధు, దస్తగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆత్మకూర్ - 07081, వనపర్తి జిల్లా, తెలంగాణ.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం) రూల్ 8 (1) మరియు (2) (స్థిరాస్తి కోసం)
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) ఆర్డినెన్స్ 2002 (నం 3 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారియగు దిగువ సంతకందారు, 12.05.2023 తేదీ గల డిమాండ్ నోటీసు జారీచేసి రుణగ్రహీతలు/ గ్యారెంటార్లు : కె. రాములు తండ్రి కె. తిమ్మన్న ఇ.నెం.8-24, భగ్యనగర్ స్ట్రీట్, ఆత్మకూర్, వనపర్తి మండలం మరియు జిల్లా - 509131, CC LOAN A/c No. 37245387133, వారిని సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులలో తెలిపిన మొత్తం 12-05-2023 నాటికి రూ.5,39,992/- (ఐదు లక్షల ముప్పైతొమ్మిది వేల తొమ్మిది వందల తొంభైరెండు రూపాయలు మాత్రమే) + వడ్డీ + ఖర్చులను తిరిగి చెల్లించవలసిందిగా కోరారు.
రుణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు ఆర్డినెన్స్‌లోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొని దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు 13-07-2023న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారించరాదని సదరు ఆస్తితో జరిపే ఎలాంటి వ్యవహారాలైనా 13-07-2023 నాటికి రూ.5,56,073/- (ఐదు లక్షల యాభైఆరు వేల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే) + దానిపై తదుపరి వడ్డీ + మరియు ఖర్చులమొత్తం కొరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆత్మకూర్ బ్రాంచ్ ఛార్జునకు లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతలను/ గ్యారెంటార్లను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

ఆస్తి షెడ్యూల్ - దిగువ ప్రదేశంలోగల నివాస భవనము

SRO ఆత్మకూర్ గ్రామము మరియు మండలం, వనపర్తి జిల్లా వారి రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం. 1301/2006 తేది: 16-05-2006 ప్రకారం శ్రీ కె. రాములు తండ్రి కె. తిమ్మన్నకు చెందినది 290.69 చ.గజాల విస్తీర్ణం గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మిత విస్తీర్ణం 2260.39 చ. అడుగులు ఆర్.సి.సి మరియు 903.56 చ.అడుగులు టిన్ షెడ్ ఇం.నెం. 19-27, 9-28, 9-29, 9-30, 9-31, 9-32, 9-33 మరియు 9-34 యావత్తు సరిహద్దులు: ఉత్తరం: యం.ఎ ఖదర్ నుండి 40 అడుగుల లేన్ ఖాళీ స్థలం, దక్షిణం: కుర్వగేరికి 25 అడుగుల రోడ్, తూర్పు :అమిరుద్దిన్ ఇంటి నుండి 3.8 అడుగుల లేన్, పశ్చిమం: మెయిన్ రోడ్.
ప్రదేశం : ఆత్మకూర్ - 07081
తేది : 13-07-2023,
సం/-అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com